

సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో బుధవారం స్థానిక నారాయణ టెక్నో స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రానికి సంబంధించిన రసాయన చర్యలు, సమీకరణాలు, రసాయన వియోగం, రసాయన సంయోగం, రసాయన స్థానభ్రంశం, రసాయన ద్వంద్వ స్థానభ్రంశం, ఆక్సీకరణం, క్షయ కరణం, తటస్థీకరణ చర్య, అవక్షయపర చర్య, దహన చర్య వంటి అనేక ప్రయోగాలు విద్యార్థులతో చేయించి అవగాహన కల్పించారు.



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

నేడు మండలి పోరు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఎంఎల్‌సి ఎన్నికలకు 440 కేంద్రాలు

ఓటేయనున్న 3,14,984 మంది పట్టభద్రులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మండలి పోరుకు సర్వం సిద్ధమైంది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం స్థానానికి గురువారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 440 కేంద్రాల్లో జరగనున్న పోలింగ్‌లో 3,14,984 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పట్టభద్రుల నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పోలింగ్ జరగనుంది. బుధవారం ఉభయ గోదావరి జిల్లాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది, సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ పోలింగ్ నిర్వహణ కోసం కాకినాడ జిల్లాలో 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 70,540 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 92 కేంద్రాల్లో 62,970 మంది, కోనసీమ జిల్లాలో 95 కేంద్రాల్లో 64,447 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 93 కేంద్రాల్లో 70,052 మంది, ఏలూరు జిల్లాలో 66 కేంద్రాల్లో 42,282 మంది, ఎఎస్ఆర్ జిల్లాలో 12 కేంద్రాల్లో 4,669 మంది మొత్తంగా 440 పోలింగ్ కేంద్రాల్లో 3,14,984 మంది ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. అలాగే మరో 16 సహాయక పోలింగ్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఓటింగ్ కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశారు.

పోలింగ్ విధుల్లో 2,714 మంది

545 మంది రిజర్వ్‌డ్ సహా పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, మరో 545 మంది రిజర్వ్‌డ్ సహా సహాయ పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు విధుల్లో పాల్గొననున్నారు. 1,080 మంది రిజర్వ్ సహా ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది రిజర్వ్ సహా సూక్ష్మ పరిశీలకులు మొత్తంగా 2,714 మంది పాల్గొంటున్నారు. సెక్టోరల్ అధికారులు, రూటు అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ సిబ్బంది తరలింపు, నిర్వహణ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

ఆరుగురు ఎస్‌పిల పర్యవేక్షణలో...

ఆరుగు గురు ఎస్‌పిలు, 27 మంది డిఎస్‌పిలు, 94 మంది సిఐలు, 189 మంది ఎస్ఐలు, 602 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ 1434 మంది, కానిస్టేబుల్స్, 205 మంది, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్స్ 11 మంది, ఎఆర్ఎస్ఐలు విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లోని ఒక మైక్రో అబ్జర్వర్ పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తారు. పోలింగ్ అనంతరం ఉభయ గోదావరి జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను ఏలూరు సిఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నారు.



కాకినాడలో ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఓటర్ ఐడీతో పాటు 9 గుర్తింపు కార్డులు అనుమతి

నేడు జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు ఓటరు గుర్తింపు కార్డు లేని ఓటర్లకు ప్రత్యామ్నాయంగా మరో 9 గుర్తింపు కార్డులకు అనుమతిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు కలిగి ఉన్నవారు తమ పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఆయా విద్యాసంస్థలు జారీచేసిన సర్వీస్ గుర్తింపు కార్డులు, విశ్వవిద్యాలయాలు జారీచేసిన డిగ్రీ, డిప్లమో ఒరిజినల్ సర్టిఫికెట్లు, దివ్యాంగులకు జారీ చేసిన ధృవపత్రం ఒరిజినల్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రయివేట్ ఇండస్ట్రియల్ హౌసెస్ జారీ చేసిన ధృవపత్రాలు, ఆధార్ కార్డు, ఎంపి, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలకు జారీ చేసిన అధికారులు గుర్తింపు కార్డును కలిగి ఉన్న వారిని కూడా ఓటింగ్‌కు అనుమతించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేశారు.

ఓటు వేయాలిలా...

- పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటింగ్ బ్యాలెట్ పేపర్‌పై జరుగుతుంది. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి పేర్లు, ఫొటోలు ఉంటాయి.
- ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ మాత్రమే అంకెలు వేయడానికి ఉపయోగించాలి
- ప్రాధాన్యతా క్రమంలో అందరికంటే ఎక్కువగా ఇష్టపాత్రుడైనవారి అభ్యర్థి పేరు ఎదురుగా గల గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి ప్రాధాన్యతను బట్టి 2, 3, 4... ఇలా నెంబర్లు వేయొచ్చు. లేదా వేయకుండా వదిలేసినా పర్వాలేదు
- ఒకే అంకెను ఇద్దరికి వేస్తే ఆ ఓటు చెల్లదు.
- మొదటి ప్రాధాన్యత ఓటు అంటే 1 అంకె వేయకుండా 2, 3, 4.. వేస్తే ఆ ఓటు చెల్లదు.
- అంకెలు కాకుండా టిక్, ఇన్‌టూ వంటి గుర్తులు వేస్తే ఓటు చెల్లదు
- 1, 2, 3,... ఈ అంకెలే వేయాలి. రోమన్ అంకెలు వాడరాదు
- ఓటింగ్‌కు వెళ్లేటప్పుడు ఎన్నికల సంఘం సూచించిన ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- వీలున్నంత వరకూ ఎక్కువ మందికి ఓటు వేయాలి. దీనివల్ల మీరు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన అభ్యర్థికి ఎలాంటి నష్టం ఉండదు.

తల్లడిల్లిన తాడిపూడి

గోదావరిలో స్నానానికి వెళ్లిన ఐదుగురు యువకుల మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి(తూర్పు గోదావరి)

శివరాత్రి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగిన ఐదుగురు యువకులు ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో తాడిపూడి గ్రామం విషాదంలో మునిగిపోయింది. యువకుల మృతితో తల్లడిల్లింది. చిన్ననటి స్నేహాన్ని మృత్యువు చిదిమేసింది. బుధవారం జరిగిన ఈ ఘటనతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

తాడిపూడికి చెందిన 11 మంది స్నేహితులు రాజమహేంద్రవరంలోని ఇంటర్, డిగ్రీ చదువుతున్నారు. వారంతా 20ఏళ్లలోపు యువకులు. చిన్ననాటి నుంచి కలిసే చదువుకున్నారు. కలిసే ఆడుకున్నారు. పండగొచ్చినా పబ్బమొచ్చిన వారి చేసే సందడి అంతాఇంతా కాదు. మహాశివరాత్రి నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామునే వారంతా కలిసి గ్రామంలోని గోదావరి నదీతీరానికి వెళ్లారు. అందరూ స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. అందులో ఒక యువకుడు గోదావరి మునిగపోతుండగా రక్షించేందుకు ఒకరి వెనుక ఒకరు ఇలా మరో నలుగురు నీటిలో మునిగి పోయారు. కళ్లముందే స్నేహితులు మునిగి పోవడంతో మిగిలిన స్నేహితులు రక్షించాలంటూ గ్రామంలోకి పరుగులు తీశారు. విషయం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే చాలా సమయంలో అవ్వడంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. చివరికి మధ్యాహ్నం 12.30 గంటలకు పడాల దేవ దత్త సాయి(18), అనిశెట్టి పవన్‌గణేష్(19), గర్రె ఆకాష్(18), తిరుమలశెట్టి శ్రీరామ విజయ పవన్(20), పడాల దుర్గాప్రసాద్(19) మృత దేహాలను వెలికి తీశారు. కుటుంబ సభ్యులు మృతదేహాలను చూసి గుండెలవిసేలా రోదించారు.




రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తాడిపూడి ప్రమాదంలో మృతి చెందిన యువకులు (ఫైల్ ఫొటోలు)



పడాల దుర్గాప్రసాద్



అనిశెట్టి పవన్‌గణేష్



టి.శ్రీరామవిజయపవన్



గర్రె ఆకాష్



పడాల దేవదత్తసాయి

ఎదిగొచ్చిన కుమారులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులను ఆపడం ఎవరితరమూ కాలేదు.

కుటుంబాలను ఆదుకుంటాం : ఎంఎల్ఎ ముప్పిడి

తాడిపూడి ఘటనలో మృతి చెందిన కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామన్నారు.

రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి : తలారి

తాడిపూడి ఘటనలో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఘటనా ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.




అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

మెటీరియల్ అంతా సరిచూసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల మెటీరియల్ అంతా సరి చూసుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. స్థానిక మెక్లారన్ హైస్కూల్లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగు మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ ఏమైనా తక్కువ ఉంటే అడిగి తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులకు ఏర్పాటు చేసిన సిబ్బంది అందరూ హాజరయ్యారా లేదా అని ఆరా తీశారు. విధులకు ఎవరైనా హాజరుకాకపోతే ఎన్నికల నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ మల్లిబాబును ఆదేశించారు. పోలింగ్ అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్లో బ్యాలెట్ బాక్సులు అందజేయాలని చెప్పారు. 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ నిర్వహించే తీరును పోలింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి, డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, ఎలక్షన్ డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రశ్నార్థకంగా 'వర్మ' భవితవ్యం

- **ఎంఎల్‌సి చాన్స్ కోసం ఆశలు**
- **అడ్డుతగులుతున్న జనసేన**
- **అభిమానుల్లో తప్పని ఉత్కంఠ**

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్‌సి ఎన్నికలకు వేళయింది. ప్రస్తుతం పట్టబద్రుల స్థానానికి ఎన్నికలు జరుగుతున్న తరుణంలో జిల్లాలో రాజకీయ వేడి కొనసాగుతోంది. ఇదే తరుణంలో 5 ఎంఎల్‌సి స్థానాలకు ఖాళీ ఏర్పడుతోంది. ఇందుకు సంబంధించి వచ్చేనెల 20న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆశావహులు అధిష్టానం వద్దకు క్యూ కడుతున్నారు. ఎవరి స్థాయిలో వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నామని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ పలువురు తెరమీదకు వస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆయా స్థానాల్లో సీట్లను ఆశించి భంగపడిన వారంతా ఇప్పుడు ఖాళీ అయిన ఎంఎల్‌సి స్థానాల కోసం పోటీ పడుతున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో పొత్తులో తమ సీట్లను త్యాగాలు చేశామని చెప్పుకుంటూ పలువురు ఎంఎల్‌సి సీటు కోసం ముందుకు వస్తున్నారు. ఇప్పటికే అన్ని రకాల ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయా నేతలను ప్రసన్నం చేసుకునే పనులు నిమగ్నమయ్యారు. ఇదే తరుణంలో ఈసారి తనకు కచ్చితంగా ఛాన్స్ వస్తుందని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎస్.వర్మ ఆశిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేయడంతో ఆ స్థానంపై ఆశలు పెట్టుకున్న వర్మ పార్టీ అధిష్టానం నిర్ణయంతో పోటీ నుంచి తప్పుకున్నారు. ఆ సమయంలోనే పార్టీ అధినేత చంద్రబాబు పార్టీ అధికారంలోకి వచ్చాక ఎంఎల్‌సిగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వర్మ పోటీ నుంచి తప్పుకుంటూ ప్రకటించారు. అనంతరం పవన్ కల్యాణ్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఈ నేపథ్యంలోనే తనకు ఎంఎల్‌సి అవకాశం ఖాయమనే నమ్మకంతో ఆయన ఉన్నారు. కానీ రాష్ట్రస్థాయి పరిస్థితులు ముఖ్యంగా కుల, ప్రాంతీయ సమీకరణల నేపథ్యంలో ఆయనకు అడ్డంకులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కేవలం ఐదు స్థానాలను మాత్రమే భర్తీ చేస్తున్న నేపథ్యంలో ఒక సీటు జనసేనకు కేటాయిస్తున్నారు. ఈ కోటాలో ఆ పార్టీ ముఖ్య నేత నాగబాబుకి దాదాపుగా ఖాయం అయింది. ఇప్పటికే దానిని ప్రకటించారు. మరొక సీటు ఎంపి పదవికి



రాజీనామా చేసి వైసిపి నుంచి టిడిపిలో చేరిన మోపిదేవి వెంకటరావుకు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. దీంతో రెండు స్థానాలు దాదాపుగా ఖరారు అయినట్లే. ఇక మిగిలిన మూడు సీట్లలో రిలీవ్ అవుతున్న యనమల రామకృష్ణుడికి మరొకసారి రెన్యువల్ చేసే అవకాశం కనిపిస్తుంది. అందుకు తగ్గట్టుగా అధిష్టానంపై యనమల ఒత్తిడి తీసుకొస్తున్నారు. మరోవైపు యనమలకు ఈసారి ఎంఎల్‌సి స్థానాన్ని రెన్యువల్ చేయకపోవచ్చుననే చర్చ కూడా నడుస్తోంది. ఆయన కుమార్తె యనమల దివ్య తుని ఎంఎల్ఎగా, అల్లుడు ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌కుమార్, వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎంఎల్ఎగా ఉన్నారు. ఈ కారణంగా ఒకే కుటుంబానికి ఇన్ని పదవులు ఇచ్చే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే యనమలకే గనుక రెన్యువల్ అయితే గోదావరి జిల్లాలో మరొకరికి ఎంఎల్‌సి అవకాశం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. వర్మకి అదొక అడ్డంకిగా భావించవచ్చు. ఒకనాటి తన గురువుగా భావించిన యనమల ఇప్పుడు ఎంఎల్‌సి రేసులో వర్మకు అడ్డంగా మారుతున్నారని ప్రచారం మాత్రం ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా ఒకే జిల్లా నుంచి ఎంఎల్‌సిగా ఇద్దరికీ అవకాశం లేదు కాబట్టి యనమలకు గానీ, వర్మకి గాని ఒకరి ఆశలకు గండి తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఈ సీటు ఇద్దరిలో ఎవరికి దక్కుతుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పిఠాపురంలో మాత్రం మాజీ ఎంఎల్ఎ వర్మ అనుచరులు ఎంఎల్‌సి పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఖచ్చితంగా ఛాన్స్ వస్తుందని భావిస్తున్నారు.

జనసేన నుంచి వ్యతిరేకత

మరోవైపు పిఠాపురం నియోజకవర్గంలో జన సైనికుల వైపు నుంచి కూడా వర్మకి అడ్డంకులు ఎదురవుతున్నట్లుగా తెలుస్తుంది. రెండో అధికార కేంద్రం నియోజకవర్గంలో ఏర్పాటు కాకుండా ఈసారి అవకాశం లేకుండా చూసే ప్రయత్నంలో భాగంగా జనసేన అధిష్టానం లాబీయింగ్ చేస్తున్నట్లుగా తెలుస్తుంది. జనసేన ఒత్తిళ్లు లేకపోతే సామాజిక సమీకరణాల రీత్యా వర్మను పక్కన పెడతారా.? లేకుంటే ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తారా..! ఏం జరుగుతుందనేది చూడాలి. ఈ నేపథ్యంలోనే వర్మ భవితవ్యం ఊగిసలాటలో ఊగుతున్నట్లుగా కనిపిస్తుంది. కానీ ఆయన మాత్రం ఈసారి తప్పకుండా తనకు ఛాన్స్ వస్తుందనే నమ్మకంతో సాగుతున్నారు. ఆ నమ్మకం నిలబడుతుందా లేకుంటే టిడిపి అధిష్టానం హ్యాండిస్తుందా అనేది వేచి తచూడాల్సిందే.

విశ్రాంత ఐపిఎస్ గోపాలకృష్ణకు నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

నీలపల్లి సిద్ధార్థనగర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఐపిఎస్ కమిడి గోపాలకృష్ణ 30వ వర్ధంతి బుధవారం బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, గ్రామపెద్దలు మోకా మధుబాబు, దడాల ఇజ్రాయిల్, మాత భూషణం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన గోపాలకృష్ణ కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి ఎంతో మంది ఉన్నతికి కృషి చేశారన్నారు. అనంతరం కెఎస్.శ్రీనివాస్, పొనుగుమట్ల అశోక్‌కుమార్ సమకూర్చిన భారత రాజ్యాంగం, రాజ్యాంగ పీఠిక, అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోకా రాహుల్, ప్రవీణ్, గంటా గోఫీ, ఎం.నందగౌతమ్, ఎం.శ్రీధర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - కాకినాడ

తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా పాఠశాలలు నిర్వహించినట్లయితే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఘనంగా మహాశివరాత్రి

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట మహాశివరాత్రి సందర్భంగా స్థానిక భీమేశ్వరాలయానికి యాత్రికులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలోనూ, గోదావరి స్నాన ఘట్టం వద్ద ఏర్పాటుచేసిన జల్లు స్నానం వద్ద యాత్రికులు స్నానాలు ఆచరించారు. క్యూలో ఉండి భీమేశ్వర స్వామిని దర్శిం చుకున్నారు. ఈ పూజల్లో కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఐజి శ్రీకాంత్, ఎస్‌పి బిందుమాధవ్, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కూడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకుని తరలివచ్చిన వేలాదిమంది యాత్రికులకు బుధవారం స్థానిక భీమేశ్వర ఆలయం పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు పులిహోర, మజ్జిగ, మంచినీరు, పాలు, బిస్కెట్లు, భోజనాలు అందించారు. ఆలయం వద్ద వేట్లపాలెం కొండపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన పాలు, రొట్టెలు, బిస్కెట్లు, పంపిణీ కార్య క్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లను డిఎస్‌పి డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద బందోబస్తును ఎస్‌పి బిందుమాదవ్ ప్రత్యక్ష పరిశీలన చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. **పెద్దాపురం** మహాశివరాత్రి సందర్భంగా పట్టణ, మండల పరిధిలోని ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసాయి. శివాలయాలను అత్యధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద సేవా సంస్థలు ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. **పిఠాపురం** స్థానిక కుక్కుటేశ్వర స్వామి దేవాలయానికి యాత్రికులు పోటెత్తారు. తొలుత పుష్కరణిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వచ్చే పలు మార్గాల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. **శంఖవరం** మహాశివరాత్రి పురస్కరిం చుకుని మండలంలోని వేలంగి గ్రామంలో ఉన్న ధార మల్లికార్జున స్వామిని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు బుధవారం దర్శించుకున్నారు ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సామర్లకోటలో సేవా కార్యక్రమాల్లో ఎంఎల్ఎ చినరాజప్ప



పిఠాపురం పాదగయలో స్నానాలు ఆచరిస్తున్న యాత్రికులు



శంఖవరంలో పాల్గొన్న ముదునూరి మురళీకృష్ణంరాజు

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం


రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చప్పిడి దయానందరాజు(52) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. మండలంలోని జి.రాగంపేట గ్రామానికి చెందిన ఆయన గత రెండేళ్లుగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మతి వార్త తెలిసిన వెంటనే ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, డిటి భానుకుమార్, తదితరులు ఆయన అంతిమ సంస్కరణలో పాల్గొని సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.



దయానందరాజు

ఎన్నికల కోడ్ పట్టదా..?

-నిషేధాజ్ఞలు పట్టని మద్యం వ్యాపారులు
-యథేచ్ఛగా అధిక ధరలకు అమ్మకాలు


కాకినాడలో మూసివేసిన షాపు పక్కనే మద్యం విక్రయాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల అధికారుల ఆదేశాలను ప్రయివేట్ మద్యం వ్యాపారులు బేఖాతరు చేశారు. గురువారం గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసి వేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆచరణలో మద్యం షాపులు మూసి వేసినా ప్రత్యామ్నాయంగా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను సాగించారు.

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి అంటే 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం విక్రయాలపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది. అలాగే వచ్చేనెల 3న జరిగే కౌంటింగ్ సందర్భంగానూ మద్యం విక్రయాలను నిషేధించింది. దీనికి సంబంధించి ఎక్సైజ్ శాఖ ఎక్కడా మద్యం దుకాణాలు తెరవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. క్లబ్బులు, స్టార్ హోటల్స్, రెస్టారెంట్లు, సాధారణ హోటల్స్‌లో కూడా ఆయా తేదీల్లో మద్యం అమ్మకూడదని నిబంధనలు విధించారు.

కోడ్ పట్టని వ్యాపారులు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి కాకినాడ జిల్లాలో 155 ప్రయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లకు ఎక్సైజ్ అధికారులు సీలు వేశారు. 27న సాయంత్రం 4 గంటల వరకు షాపులు ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవకూడదని యజమానులకు వివరించారు. అయితే మద్యం వ్యాపారులు ఒక అడుగు ముందుకేసి ముందుగానే మద్యం కేసులను షాపుల సమీపంలోనే పక్కన పెట్టారు. సీలు వేసిన రోజు నుంచే వెనక భాగం నుంచి అమ్మకాలు మొదలుపెట్టారు. దాదాపుగా జిల్లాలో ఉన్న అన్ని దుకాణాల్లోనూ ప్రస్తుతం ఈ అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. విక్రయాలు జరుగుతున్నట్లుగా సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ చూచి చూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే పలుచోట్ల సిండికేట్‌గా మారిన వ్యాపారులు ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ప్రతి నెలా కొంత మొత్తంలో మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కోడ్ నిబంధనలను ఉల్లంఘించి మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ అధికారులు అటువైపు చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధిక ధరలకు అమ్మకాలు

సీలు వేసి ఉన్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలోనే అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మద్యం వ్యాపారులు అధిక ధరలకు వివిధ బ్రాండ్లను విక్రయిస్తున్నారు. క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50కి అదనంగా అమ్ముతూ మందు బాబుల జేబులను కొల్లగొడుతున్నారు. ప్రధానంగా కాకినాడ, పిఠాపురం. యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, తుని తదితర ప్రాంతాల్లో ఈ విక్రయాలు గత రెండు రోజులుగా జోరుగా సాగుతున్నాయి. బాటిల్‌పై ఎంఆర్‌పికి మించి అమ్ముతున్నప్పటికీ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. అయితే అదనంగా అమ్ముతున్న సొమ్ములో కొంత ఎక్సైజ్ శాఖ అధికారులకు ముట్టజెప్పితుండడం వల్లనే ఈ వ్యవహారంపై నోరు మెదపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించడంపై ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ స్పందించకపోవడం గమనార్హం.

వక్ఫ్ బిల్లును టిడిపి వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ముస్లింల పక్షపాతిగా చెప్పు కోవాలంటే పార్లమెంటులో తెలుగుదేశం పార్టీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ (మా) కోరింది. బుధవారం జెఎన్‌టియు వద్ద ఉన్న మేవా ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జవహర్ ఆలీ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం చట్టరూపం కాకుండా ఉపసంహరించేలా చేయాలని కోరారు. ఈ సవరణ బిల్లు వల్ల ముస్లిం ఆస్తులు, ముస్లిం సమూహం పైన తీవ్ర ప్రభావం చూపుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును వక్ఫ్ బోర్డుతో పాటు ముస్లిం సంఘాలు, ఇతర పౌర సమాజ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణల కోసం 31 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటు కమిటీ ఏర్పాటు (జెపిసి) వేసిందని, వీరు బిల్లును సమగ్రంగా పరిశీలించి ముస్లిం పెద్దల అభిప్రాయాలను సేకరణ చేస్తారన్నారు. ఆ విధంగా ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంట్ కమిటీలో


సమావేశంలో మాట్లాడుతున్న జవహర్ ఆలీ

అత్యధికమంది పాలకపక్షాల వారు ఉండటం వల్ల ఈ బిల్లు వారికే అనుకూలంగా చెందే అవకాశం ఉందన్నారు. ఈ బిల్లు సవరణలు చేస్తే వక్ఫ్ ఆస్తులను భూకబ్జా, మాఫియాలు ప్రోత్సహించేందుకు అవకాశం ఉందని అన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుటిల ప్రయత్నాన్ని పార్లమెంటులో టిడిపి వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో మా సభ్యులు ఎస్.ఎజాజుద్దీన్, మహమ్మద్ ఇక్బాల్ ఇక్బాల్ ఆలీ, ఆల్తాఫ్ మహమ్మద్, మహమ్మద్ సియాజుద్దీన్, సయ్యద్ సాలార్, దీన్ తదితరులు పాల్గొన్నారు.


కల్వర్టుకు రక్షణ కూలిపోయిన వైనం

ప్రమాదకరంగా కల్వర్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

నాలుగు రహదారుల కూడలి వద్ద కల్వర్టుపై రెండు వైపుల రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా మారింది. స్థానిక మేదర వీధి నుంచి శివాలయం గుడి వీధి, శోభా థియేటర్ వీధి, మెయిన్ రోడ్ వినాయకుడి గుడి సెంటర్, ఇళ్ల బోయిన వారి వీధి మీదుగా నువ్వుల గుంట వీధిలకు వెళ్లే మేదర వీధి సెంటర్‌లో మురుగు నీరు, వర్షపు నీరు, గౌరీ కోనేరు నిండినప్పుడు అదనపు నీరు ప్రవహించే పెద్ద డ్రైన్‌పై పడమర, ఉత్తరం వైపు రక్షణ గోడలు కూలిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రక్షణ గోడలు నిర్మిం చాలని అనేకసార్లు మున్సిపల్ అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రజలు కూలిన రక్షణ గోడల వద్ద ప్రమాదం తెలియజేసేందుకు ప్లాస్టిక్ డబ్బాలు, ఇసుక మూటలు పెడుతున్నా ఎక్కువ కాలం ఉండటం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈ కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన 31 పోలింగ్ కేంద్రాలకు స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నుంచి బుధవారం పోలింగ్ సామాగ్రి, అధికారులు, సిబ్బంది తరలి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని సహాయ కలెక్టర్ భావన, ఆర్‌డిఒ శ్రీ.రమణి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ డివిజన్లోని 11 మండలాల పరిధిలో 31 పోలింగ్ కేంద్రాల ద్వారా 19,967 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. ఈ పోలింగ్ స్టేషనులకు 7 రూట్‌ల ద్వారా వాహనాలపై తరలింపు ప్రక్రియ సాగిందన్నారు. **తాళ్లరేవు** మండలంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధం అయ్యారు. మండలంలో తాళ్లరేవు మండల పరిషత్, పటవల పంచాయతీ, సుంకరపాలెం పంచాయతీ కార్యాలయాలలోని పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2514 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. 28వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 163 సెక్షన్ అమల్లో ఉంటుందని తహశీల్దార్ పి.త్రినాధ రావు తెలిపారు. **కరప** స్థానిక జడ్‌పి హైస్కూల్‌తోపాటు, ఎంపిపి స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ పరిశీలించారు. హైస్కూల్లో 141, 142 బూత్‌లు, ఎంపిపి స్కూల్లో 143 బూత్‌ను ఏర్పాటు చేశారు. 141 బూత్‌లో 846, 142వ బూత్‌లో 877, 143వ బూత్‌లో 758 ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొంటారని తహశీల్దార్ తెలిపారు. **తుని** నియోజకవర్గ పరిధిలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తియ్యాయి. తుని పట్టణంలో 5 పోలింగ్ కేంద్రాలు, కోటనందూరు మండలంలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ భావన, ఆర్‌డిఒ శ్రీరమణి సందర్శించారు. తుని నియోజకవర్గంలో 3,480 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వారు తెలిపారు. సిఐ ఎం.గీతారామకృష్ణ, జి.చెన్నకేశవరావు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పర్యటనలో తుని, కోటనందూరు తహశీల్దార్లు జివిఎస్.ప్రసాద్, టి.సుభాష్, ఎంపిడిఒలు వి.వెంకటనారాయణ, కె.సాయినవీన్ పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సి పోలింగ్ కేంద్రంల్లో ఏర్పాట్లు పూర్తియ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


తుని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా గణేష్‌నాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - కరప

జనసేన పార్టీ గోదావరి జిల్లాల ఎన్నికల నిర్వహణ కో కన్వీనర్ నున్న గణేష్‌నాయుడు జన్మదిన వేడుకలు బుధవారం ఎంఎల్‌ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎంఎల్‌ఎ స్వగృహం వద్ద జరిగిన ఈ వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకుల్లో గణేష్‌నాయుడు ప్రత్యేక గుర్తింపును పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, యాళ్ల హరినాథ్, వెలుగుబంట్ల సూరిబాబు, యాళ్ల వీరవెంకటసత్యనారాయణ, సుధీర్, మెండు గోవిందు, పన్నీరు శివ, చిన్నారి శీను, ఆచంట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

వెటర్నరీ ఎడి డాక్టర్ అనితకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

ఎపి పశుసంవర్ధక శాఖ అధికారుల సర్వీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనితను పలువురు అభినందించారు. విజయవాడ లబ్బీపేటలోని ఎన్‌టిఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి ఆవరణలో ఎపి యానిమల్ హస్‌బెండరీ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికల్లో ఆమె ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అనితను అధికారులు, సిబ్బంది అభినందించారు.

ఘనంగా మహా శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - కిర్లంపూడి, గొల్లప్రోలు

కిర్లంపూడి మండలంలోని గోపాలపట్నం, పాలెం గ్రామ శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తామరాడలోని అన్న దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. సర్పంచ్ తోట అయ్యప్ప కమిటీ సభ్యుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే గొల్లప్రోలు మండలంలో మహాశివరాత్రి సందర్భంగా స్థానిక శిరిడి సాయి ఆలయం వద్ద వాసవి క్లబ్ గొల్లపూడి ట్రస్ట్ సాయంతో మజ్జిగ పంపిణీ చేశారు. గత 20 ఏళ్లుగా గొల్లపూడి ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఛైర్మన్ కేదర్శిని చలపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు కుసుమంచి పాపారావు, ఊరసుబ్బారావు, శివ గణేష్, గొల్లపూడి భాస్కర్‌రావు, దంగేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కరప : పరీక్షలు రాసేందుకు సిద్ధపడుతున్న విద్యార్థులకు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పరీక్షా సామాగ్రిని అందించారు. బుధవారం స్థానిక శాంతి బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యావేత్త షేక్ దాదాజీ, పాస్టర్ ప్రకాష్, సిస్టర్ కృప, సిస్టర్ రమ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన మరో కౌన్సిలర్

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపాలిటీలో వైసిపికి చెందిన కౌన్సిలర్ల వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఒకటో వార్డు కౌన్సిలర్ వారా జ్యోతి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో టిడిపిలో చేరారు. దీంతో టిడిపి కౌన్సిలర్ల బలం 17కు చేరింది. దీంతో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు టిడిపి కైవసం చేసుకోనుంది. మిగిలిన కౌన్సిలర్లు కూడా టిడిపి పార్టీలోకి రావడం ఖాయమని, తుని పట్టణాన్ని అభివృద్ధి చేసుకునేందుకే కౌన్సిలర్లు టిడిపిలో చేరుతున్నారని టిడిపి నాయకుడు యనమల రాజేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, నాయకులు మోతుకూరు వెంకటేష్, కుసుమంచి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.


యనమలతో కౌన్సిలర్ వారా జ్యోతి

ఘనంగా సరస్వతీ పూజలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సరస్వతి పూజలను ఘనంగా నిర్వహించారు బుధవారం ఇఒ సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చకులు సరస్వతి విగ్రహం వద్ద పెన్నలు, రక్షా కంకణాలు ఏర్పాటు చేసి వైదిక పూజలు నిర్వహించారు. అనంతరం వీటిని ఇఒ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కె.కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరం కావాలి

ప్రజాశక్తి - పిఠాపురం

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్‌లో మద్యపాన, ధూమపాన, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యపానం, ధూమపానం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాస్, సిహెచ్.సతీష్, పి.వేణు, కె.అప్పారావు, డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, సాల్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

8 మంది ఎన్నికల సిబ్బంది సస్పెన్షన్

ప్రజాశక్తి - కాకినాడ

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల విధులకు హాజరు కాని 8 మంది ఒపిఒలను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి పోలింగ్‌లో విధులు నిర్వహించడానికి నియమించిన సిబ్బందిలో కాకినాడలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రానికి ముగ్గురు, పెద్దాపురం డివిజన్‌కు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రానికి ఐదుగురు ఒపిఒలు గైర్హాజరు అయ్యారు. ఎన్నికల నిబంధనల మేరకు విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న హాకీ టోర్నమెంట్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



ఈనెల 15 నుంచి జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్–2025 బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాలకు చెందిన పురుషుల జట్లు మూడు పోటీ పడ్డాయి. సెంట్రల్ సెక్రటేరియట్ – అర్ఎస్‌బి కన్పూర్ జట్ల మధ్య జరిగిన పురుషుల క్వాటర్ ఫైనల్ మ్యాచులో సెంట్రల్ సెక్రటేరియట్ 3–1 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్ – మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచులో హర్యానా సెక్రటేరియట్ 7–1 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్ – చత్తీస్‌ఘడ్ జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచులో ఒడిస్సా సెక్రటేరియట్ 4–1 తేడాతో విజయం సాధించింది.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి వుద్రిలంక మంగ, భర్త: వుద్రిలంక సుబ్బారావు గార్కి ఉచ్చిలి గ్రామంలో గల డాక్యుమెంటు నెం. 75/2011 హక్కు విడుదల దస్తావేజు పొందియున్నారు. సదరు ఆస్తిని వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, రావులపాలెం బ్రాంచ్ నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్ ఒరిజినల్ రిజిష్టర్ దస్తావేజు నెం. 557/1982 డాక్యుమెంటు జిరాక్సు నిమిత్తం ఉచ్చిలి ఇంటి దగ్గర నుండి రావులపాలెం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, రావులపాలెం బ్రాంచ్ నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా హక్కు విడుదల దస్తావేజు 75/2011 ఒరిజినల్ డాక్యుమెంటు సదరు బ్రాంచ్‌కు అవసరమయిన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపసు చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా, ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు వాటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధముగా మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎన్.తాతారెడ్డి, అడ్వకేట్/ నోటరీ
రామచంద్రాపురం రామచంద్రాపురం
ది.27–2–2025 సెల్: 98866 960337

జనరల్ నోటీసు

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P. No.99/2024
(వెలగ పూర్ణశ్రీ ఆది వీరేంద్ర, వయస్సు 17 సం॥లు, వెలగ ఉషశ్రీ, వయస్సు 12 సం॥లు తరపున వేసిన గార్డియన్ & వార్డ్స్ అర్జీ వాజ్యములో)
Between:
వెలగ లక్ష్మీ మంగతాయారు ...పిటీషనర్
మరియు
Nil ...రెస్పాండెంట్

పై నెంబరు వాజ్యములో పిటీషనరు తన పిల్లలైన వెలగ పూర్ణశ్రీ ఆది వీరేంద్ర, వయస్సు 17 సం॥లు, వెలగ ఉషశ్రీ, వయస్సు 12 సం॥లు తరపున వేసిన గార్డియన్ & వార్డ్స్ అక్ట్ క్రింద ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని తన పిల్లల పోషణ మరియు శ్రేయస్సు కొరకు క్రయము చేయుటకు అనుమతి కోరుతూ పిటిషను దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టువారు ఈ పేపరు ద్వారా సదరు విషయమై పబ్లిక్ నోటీసు అమలుకు ఆర్డరు వేసినారు. కావున ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ది.**04-03-2025** తారీఖున ఉదయం గం॥ **10.30** నిముషములకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క వాదనను తెలుపుకోవలసినది. లేనియెడల మీకు పరోక్షమున తీర్మానము చేయబడును అని తెలియజేయడమైనది.
షెడ్యూలు: కాకినాడ జిల్లా, (పూర్వం తూ॥గో॥ జిల్లా), కరప మండలం, తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రారు, పెద్దాపురప్పాడు గ్రామ పంచాయితీ ఏరియా, పెద్దాపురప్పాడు గ్రామం, జిరాయితీ పల్లం, సర్వే నెం.307/1 పూరా య.2.99 సెంట్లు తూర్పువైపు య.0.90 సెంట్లుకు సరిసమానమైన 0.364 హెక్టార్లు భూమికి హద్దులు:
తూర్పు: తుమ్మలపల్లి వెంకటరమనమ్మ గారి సర్వే నెం.307/6లో భూమి, **పడమర:** వెలగ రాజరాజేశ్వర రావు గారి య.0.70 సెంట్లు భూమి మరియు మట్ట సూర్య మాధురి గారి య.0.90 సెంట్లు భూమి, **ఉత్తరం:** తుమ్మలపల్లి వెంకటరమనమ్మ మరియు చందా అప్పారావు గార్ల భూమి (Pedcasetti), **దక్షిణం:** తుమ్మలపల్లి వెంకటరమనమ్మ మరియు మట్ట సూర్య మాధురి గార్ల సర్వే నెం.307/2లో భూమి. ఈ హద్దుల మధ్య య.0.90 సెంట్లు భూమి సర్వ యీజిమెంటు హక్కులతో సహా.

T.M.K. శర్మ, అడ్వకేట్
కొత్తపేట-533223, సెల్: 9849564708
భమిడిపాటి వెంకటరామ శర్మ
అడ్వకేట్, కాకినాడ, సెల్: 9246589838

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా ఘటనలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి/కొవ్వూరు

కొవ్వూరు–తాళ్లపూడి రోడ్డులోని చిడిపి వద్ద బుధవారం పట్టిసీమ వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి నుంచి ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ శైవ క్షేత్రానికి ఆటోలో కొంతమంది బుధవారం ఉదయం బయలుదేరారు. ఆటో చిడిపి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి గట్టు కిందకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న తుమ్ము రమణ అక్కడికక్కడే మృతి చెందారు. మరికొంతమంది గాయపడ్డారు. వీరిని కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. ఆటుగా వెళ్తున్న కలెక్టర్ ప్రశాంతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పోస్టింగ్ పెట్టిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పూసలు అమ్ముకుంటున్న బాలిక ఫోటో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. మండలంలోని సిహెచ్.గున్నేపల్లిలో ఆదివారం జరిగిన సత్తెమ్మ జాతర తీర్థంలో ఒక బాలిక పూసలు అమ్ముకుంటుండగా, అమలాపురం చిందాడ గరువుకు చెందిన సత్తి దేవిశ్రీ ప్రసాద్ ఆమె వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. దీంతో బాలికను తోటి విద్యార్థులు ఎగతాళి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. బాలిక పిన్ని ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. అనాతవరం క్రైం వారి వీధికి చెందిన పేరాబత్తుల శ్రీమహలక్ష్మి (32) తన తోటి కోడలు లక్ష్మితో కలిసి గత ఆదివారం కొమరగిరి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ అనాతవరం వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో ఇద్దరు విద్యార్థులు స్కూటీతో ఢీకొట్టడంతో మహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. శ్రీమహలక్ష్మికి భర్త నాగబాబు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీపోలవరంలో భారీ చోరీ

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలోని లక్ష్మీపోలవరంలో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి రూ.6 లక్షల 10 వేల విలువైన 246 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్షా 70 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దేవరపల్లి శ్రీనివాసరావు, పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం ముప్పర్తిపాడులో జరిగే అమ్మ వారి జాతర కోసం కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వెళ్లారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి రావులపాలెం పోలీసులకు సమాచారం అందించారు. రావులపాలెం సిఐ ఎం.శేఖర్ బాబు సిబ్బందితో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమును రప్పించి చోరీకి పాల్పడిన వారి ఆధారాల కోసం అన్వేషించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక బైపాస్ రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజామున అన్నవరం నుంచి పిఠాపురం పాదగయ గుడికి వెళుతున్న ప్యాసింజర్ ఆటో గొల్లప్రోలు బైపాస్ రోడ్డు శ్రీరామ స్కూల్ వద్ద ఆగి ఉన్న పార్సిల్ వ్యాన్‌ను ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొండింగి మండలం గోపాలపట్నంకు చెందిన బెక్కం నాగేశ్వరావు(50), అతని తల్లి మంగయ్యమ్మకు బలమైన రక్తపు గాయాలయ్యాయి. వారిని కాకినాడ జిజిహెచ్ తరలించారు. ఆసుపత్రిలో అతని పరిస్థితి విషమించి మృతి చెందాడు. చికిత్స పొందుతూ బెక్కం నాగేశ్వరరావు మతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చునని ఎస్‌సి సంక్షేమ సంఘం పేర్కొంది. నగర పంచాయతీ పరిధిలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో 50 మంది ఇంటర్ విద్యార్థినిలకు బుధవారం ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సమకూర్చిన పరీక్షల మెటీరియల్‌ను సంఘం అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలోనే లక్ష్యాలను నిర్ధేశించుకుని, వాటిని సాకారం చేసుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చదివి గమ్యాన్ని చేరుకోవచ్చునని సూచించారు. ఇంటర్‌లో మంచి ఫిలితాలు సాధించి కళాశాల, హాస్టల్‌కు మంచిపేరు తీసుకురావాలని, అంబేద్కర్ ఆశయ సాధనకు పే బ్యాక్ టు సొసైటీలో భాగంగా పరీక్ష సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జా రమణశ్రీ, కాశి వెంకటాచార్య, ఎం.ఆశీర్వాదం, జగ్జీవన్ రామ్, జనిపల్లి సత్యనారాయణ, డేనియల్, కె.రాము, భైరవ స్వామి, ఎన్.అబ్బులు, వార్డెన్ వి.అనురాధ పాల్గొన్నారు.

టైలర్స్ ఉపాధ్యక్షునిగా వెంకటరమణారావు

ప్రజాశక్తి - రాజోలు

టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షునిగా రాజోలుకు చెందిన స్టైలో టైలర్ కడలి వెంకటరమణారావు ఎన్నికయ్యారు. గురువారం ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు పోగుల మల్లికార్జునరావు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వెంకటరమణారావు నియామకంపై రాజోలు పట్టణ టైలర్ సంఘం సభ్యులు హర్ష వ్యక్తం చేశారు. గతంలో వెంకటరమణారావు రాజోలు పట్టణ టైలర్ సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన నియామకంపై రాజోలు సంఘం అధ్యక్షుడు గుబ్బల నరసింహస్వామి, కార్యదర్శి మామిడిశెట్టి సత్యనారాయణ, సంఘం నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, మద్దుల త్రినాథరావు, కడియం సత్యనారాయణ, హర్షం వ్యక్తం చేశారు.

యానాం వార్తలు


క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ అశోక్

తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి కాలనీలో శిథిలమైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. డ్రెయినేజీకి సంబంధించిన కల్వర్టు పూర్తిగా శిథిలం అవడంతో మురుగునీరు ప్రవాహం లేదని, దీంతో ఇంటి గుమ్మాల్లోకి మురుగునీరు వస్తుందని స్థానికులు ఎంఎల్‌ఎకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన బుధవారం కాలనీని సందర్శించారు. తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దరియాలతిప్పలోని ఐలాండ్ నెంబర్–3కి వెళ్లే నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యుడి ఎఇ కాళ్ళ నాగరాజు, హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ ఇన్‌ఛార్జ్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్ అశోక్

మలేరియా నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - యానాం

మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. బుధవారం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన మలేరియాపై సమీక్షించారు. మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తన సొంత నిధులతో దోమల మందు పిచికారి చేయించినట్లు తెలిపారు. ఇకపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిడి రవిశంకర్, ఎడి పలాస్‌కుమార్, పిడబ్ల్యుడి ఎఇ కాళ్ల నాగరాజు, విద్యాశాఖ అధికారి పిఎల్.ప్రవీణ్, మత్స్యశాఖ అధికారి గొంతియ్య పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో పలు ఆలయాల వద్ద శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భైరవపాలెం గ్రామంలో కాలభైరవ స్వామిని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దర్శించుకున్నారు. సావిత్రి నగర్, గిరియం పేట ఎంఎల్‌ఎకు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయలక్ష్మి కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మల్లాడి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఘనంగా లూర్దు మాత యాత్ర...

ప్రజాశక్తి - యానాం

స్థానిక రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో బుధవారం ఉదయం నుంచి లూర్దుమాత యాత్ర మహోత్సవం ఘనంగా జరిగింది. పునీతమ్మ చర్చిఫాదర్ మారియాదాస్ అధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పార్థనలు జరిగాయి. యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సాయంత్రం యానాం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా రామారావు నియామకం

ప్రజాశక్తి - కాకినాడ



రెడ్ క్రాస్ ఎపి స్టేట్ శాఖ ఛైర్మన్ వైడి.రామారావు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి 12 మందితో కూడిన జాతీయ కార్యవర్గానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జెపి.నడ్డా ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. రెడ్ క్రాస్ జాతీయ అధ్యక్షులుగా రాష్ట్రపతి వ్యవహరిస్తారు. రామారావుకు రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గంలో చోటు లభించడం గర్వకారణమని జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైడి.రామారావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.